సూర్య
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
గురువారం,18 జూలై 2024


# ఎస్సీ,బీసి బాలికల హాస్టళ్ళ ఆకస్మిక తనిఖీ

**– విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే నాయకర్**



**నరసాపుర మేజర్ న్యూస్ :** పట్టణం లోని 21 వ వార్డు ఎన్టీఆర్ కాలనీలోని ఎస్సీ,బీసి బాలికల హాస్టల్స్‌ను ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. హాస్టల్స్ లోఉన్న వసతి,భోజనాలు,మౌలిక సదుపాయాలు విద్యార్థిని లను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు భోజనాలు వడ్డించి వారితో కలిసి భోజనంచేశారు. హాస్టల్స్‌లో అవసంమైన మరమ్మతు పనులు చేపడతామని అన్నారు. ఏ సమస్య వచ్చిన తనను సంప్రదించాలని విద్యార్థులకు నాయకర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జక్కం బాబ్జి,వలవల నాని,నిప్పులేటి తారక రామారావు,భారతి సురేష్,పోలిశెట్టి సాంబ, బొమ్మిడీ కృష్ణమూర్తి, బొమ్మిడి సూర్యకుమారి,కొల్లా బత్తుల వెంకటేశ్వరరావు,గణేషణ శ్రీరామ్,చెన్నూరి పెద్దరాజు,భీమల శ్రీనివాస్,గ్రంధినాని, ఓలేటిదేవి,జడ్డు మల్లికార్జునరావు, పాల్గొన్నారు.

# ఎంపీడీవో అదృశ్యంపై స్పందించిన పవన్ కళ్యాణ్

**– తక్షణమే విచారణ చేపట్టాలని పోలీసులకు డిప్యూటీ సీఎం ఆదేశం**
**– కార్యాలయ సిబ్బందితో కలెక్టర్ నాగరాణి సమీక్ష**
**– ఆవేదన వ్యక్తం చేస్తున్న ఎంపీడీవో భార్య సునీత**

**– నర్సాపురం రూరల్,మేజర్ న్యూస్ :** ఎంపీడీవో గా నర్సాపురంలో జనవరి24 నుండి పనిచేస్తున్న ఎం వి రమణ రావు అదృశ్యం అందరినీ ఆందోళనకు గురి చేస్తుంది. ఈ విషయమై వెంటనే చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. మాధవాయిపాలెం ఫెర్రీబకాయి వివరాలు అందించాలని ఆయన ఆదేశించారు. బుధవారం రాత్రిజిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఎంపీడీవో కార్యాలయం సిబ్బందితో భీమవరంలోని కలెక్టరేట్లో సమీక్ష నిర్వహించారు. రూ 54 లక్షలు బకాయి ఇవ్వకపోవటానికి కారణాలు ఆమె అడిగి తెలుసుకున్నారు.ఇదిలా ఉండగా తన భర్త 33 ఏళ్ల సర్వీసులో ఎక్కడ అవినీతికి పాల్పడలేదని, ఉద్యోగమే దేవాలయంగా భావించి పనిచేశారని ఎంపీడీవో భార్య సునీతఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆమె సూర్య ప్రతినిధితో ఫోన్లో మాట్లాడారు. ఈనెల 15న ఆయన పుట్టినరోజు అని అదే రోజు పని ఉందని బయటికి వెళ్లి అదృశ్యమయ్యారని తెలిపారు. తమ పెద్ద కుమారుడుసింగపూర్ నుండి వచ్చినప్పటికీ ఎంతసేపు బకాయి కోసమే ఆలోచి ంచేవారని,



సర్వీసులో ఎవతో నూ మాటపడలేదనిఆవేదన చెందే వారిని తెలిపారు. సింగపూర్ నుండివచ్చిన కుమారుడుతో కూడా సంతోషంగా గడపలేదని, నరసాపురంలో ఉన్న వైసీపీ నాయకులంతా ఒకటైపోయారని ఎవరు సహాయం చేసే వారు లేరని ఎంపీడీవో ఆవేదన చెందినట్టు సునీత తెలిపారు. నర్సాపురం లో జరిగిన విషయాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు లేఖ రాశారనిఆమె తెలిపారు. నిస్వార్థంగా పనిచేసే అధికారిని వైసిపినాయకులు మోసం చేశారని సునీత కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం స్పందించి తన భర్తకు జరిగిన అన్యాయంపై పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులను శిక్షించాలని, తన భర్త ఎక్కడున్నారో, ఎలా ఉన్నారు తొందరగా అధికారులు కనుగొనాలని సునీత అన్నారు.

# రైతు సంక్షేమ కోసం ప్రభుత్వం కృషి

**– అన్నదాతను తాకట్టు పెట్టిన ఘనుడు జగన్**
**– రూ.289.45 లక్షలతో రోడ్డుకు శంకుస్థాపన : మంత్రి డా.నిమ్మల**

**పాలకొల్లు,పొడూరు,మేజర్‌న్యూస్:** రైతుల సంక్షేమ ప్రభుత్వంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పని చేస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రినిమ్మల రామానాయుడు తెలిపారు.జగన్ ప్రభుత్వంలో రైతులకు దాళ్వా పంటకు రూ.1650 కోట్లు చెల్లించాలన్నారు. రైతులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే బకాయిలు తీర్చేందుకు 1000 కోట్లు నిధులు సమకూర్చారన్నారు. పోడూరు మండలం రావిపాడు గ్రామంలో బుధవారంనాలుగుగ్రామాలనుకలిపే ఆర్అండ్‌బి రోడ్డుకు రూ.289.45 లక్షల శంకుస్థాపన. మరో రూ.10 లక్షలతో రావిపాడు ఇండ్ల కాలనీల వద్ద సిసి రోడ్డుకు శంకుస్థాపనలు చేసారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేను ఒక రైతు బిడ్డనేనని, రైతు కుటుంబంలో నుండి వచ్చిన వాడిననిఅన్నారు.గ్రామాలు అభివృద్ధి చెందాలంటే వ్యవసాయం, పారిశ్రామిక రంగం, రహదారులు, శాంతిభద్రతలు బాగుండాలి,ఆనాడు తెలుగుదేశం పార్టీ,యన్డిఏప్రభుత్వంఅభివృద్ధికిస్వీకారం చుట్టామన్నారు. రైతు సంక్షేమానికి, రైతు లాభ సాటి వ్యవసాయం అందించుటకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి ప్రధాన ఏజెండాఅన్నారు.సివిల్ సప్లై కార్పోరేషన్ చూపించి జగన్ రూ 36 వేలు కోట్లు అప్పులు తీసుకుని రైతులకు



చెల్లించకుండా ప్రక్కదారి పట్టించాడని మంత్రి అన్నారు. రాష్ట్రంలో డ్రైన్స్,కాలువల్లో గుర్రపు డెక్క,తూడు తొలగించు టకు 960 పనులకు రూ 90కోట్లుకేటాయించి,పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ,రైతులు ఆనందంవ్యక్తం చేస్తున్నారని తెలిపారు.ఈకార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ కె.రమా కాంతారావు,డిఈలు జివెంకటరత్నం, డి. సత్య నారాయణ, ఏఈలు పి. ఏడుకొండలు, సూర్యకుమార్, గ్రామ సర్పంచి పెనుమత్సవిజయలక్ష్మి,తెలుగుదేశం,బిజెపి,జనసేన నాయకులు పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు హాజరు అయ్యారు.

## మేయర్ నూర్జహాన్ ఇంటికి ఎమ్మెల్యే బడేటి చంటి



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణ నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు స్వగృహానికి బుధవారం విచ్చేశారు. స్థానిక ఎస్ఎంఆర్ నగర్‌లో ఒక శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన శాసనసభ్యులు బడేటి చంటి ఎస్ఎంఆర్ నగర్‌లో ఉన్న మేయర్ నూర్జహాన్ పెదబాబు ఇంటికి విచ్చేశారు. ఈ సందర్భంగా మేయర్ దంపతులు శాసనసభ్యులు కి స్వాగతం పలికి బొకే ఇచ్చి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు ఏర్పాటు చేసిన తేనేటీ విందు శాసనసభ్యులు వారు స్వీకరించారు. నగర అభివృద్ధి,శానిటేషన్ పనులపై తీసుకోవలసిన చర్యలు తదితర విషయాలపై కొద్దిసేపు ఇరువురు చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, కార్పొరేటర్లు సబ్బన శ్రీనివాసరావు,బత్తిన విజయ్ కుమార్, దేవరకొండ శ్రీనివాసరావు,ఈదుపల్లి పవన్. నాయకులు ఆర్నేపల్లి తిరుపతిరావు,అమరావతి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్పి అద్నాన్ నయీం అస్మి బాధ్యతలు స్వీకారం



భీమవరం,మేజర్ న్యూస్ : అద్నాన్ నయీం అస్మి బుదవారం పశ్చిమగోదావరి జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ముందుగా జిల్లా ఎస్పీకి జిల్లా అదనపు ఎస్పీలు పుష్ప గుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జిల్లాలోని పాత్రికేయ మిత్రులతో మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ. జిల్లాలో మహిళల రక్షణకి అధిక ప్రాముఖ్యత ఇస్తాము అదే విదంగా చిన్న పిల్లల మీద జరిగే దాడులు ను అరికడతాము అని, మహిళలు, పిల్లల మీద జరిగిన నేరాలలో ముద్దాయిలకు త్వరితగతిన ట్రైయిల్ నిర్వహించి కోర్టు లో శిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాలేజీల వద్ద,స్కూల్ ల వద్ద ఈవ్ టీజింగ్ ర్యాగింగ్ లేకుండా నిరంతర గస్తీ మరియు కాలేజీ,స్కూల్ లలో అవగాహన కలిపిస్తాము అని తెలిపారు. జిల్లాలో గంజాయి ని సమూలంగా లేకుండా చేస్తాం అని, గంజాయి అమ్మే వ్యక్తులు ను గుర్తించి గంజాయి రవాణా చేసే వారిని వాటి మూలాలను గుర్తించి గంజాయి లేకుండా చేస్తాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) వి.భీమారావు,జిల్లా అదనపు ఎస్పీ,ఎ.టి.వి రవికుమార్, పలువురు డిఎస్‌పిలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన ఎస్పి అస్మితో ఎమ్మెల్యే బొలిశెట్టి భేటీ



**భీమవరం/తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్:** పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నందు సూపరెడెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీమ్ అస్మిని మర్యాదపూర్వకంగా కలిసిన తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ నియోజకవర్గంలో శాంతి భద్రతలు,స్థానిక సమస్యలను వివరిస్తూ, పలు అంశాలపై చర్చించారు.

# అంగరంగ వైభవంగా జగన్నాథుడి రథోత్సవం





**ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్:** చిన్నవెంకన్న ఆలయానికి ఉపాలయమైన లక్ష్మీపురం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర సంతాన వేణుగోపాల జగన్నాథ స్వామి వారి ఆలయంలో శ్రీ జగన్నాధుని రథోత్సవాల ఈనెల 7వ తేదీ నుంచి 17వతేదీ వరకుఅత్యంత వైభవముగా నిర్వహించారు. తిమ్మాపురం గ్రామ మహిళా భక్తులు స్వామి వారికి వివిధ రకాల స్వీట్స్‌తో సారిని సమర్పించారు. రథోత్సవంలో భాగంగాచివరిరోజుస్వామివారి రథ మహోత్సవం శ్రీ వైఖానస ఆగమ విధిగా దశావతార అలంకారాలలో భాగంగా 10వరోజు స్వామివారు కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామిగా అలంకారంలోభక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు పూజలు నిర్వహించుకున్నారు. నేటితో జగన్నాథుడు రథత్సవములు ముగియడంతో చివరి రోజు స్వామివారు విశేష సుగంధ భరిత పుష్పమాలికలతో విద్యుత్ దీపాలంకరణలతో ప్రత్యేకంగా అలంకరించిన రథముపై బలభద్ర సుభద్ర జగన్నాథ స్వామి వారిని వేంచేసి శుభముహూర్త సమయములో అర్చకులు పూజలు నిర్వహించి హారతులు ఇచ్చారు. స్వామివారు రథము ముందు భాగములో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అధికారులు టెంకాయలను కొట్టి రథోత్సవాన్ని త్రాడులాగి ప్రారంభించారు. తిమ్మాపురం గ్రామంనకు ఊరేగింపుగా మేళ తాళాలు మంగళ వాయిద్యాలు, మహిళ భక్తుల చిన్నారుల కోలాట నృత్యాలు,విశేష వేషధారణల నడుమ బయలుదేరి తిమ్మాపురం గ్రామ పురవీధులలో జగన్నాధుని రథమహోత్సవాన్ని కనుల పండుగ జరిపారు.వీక్షించిన భక్తులు జగన్నాథ నామస్మరణలతో బలబద్ర సుభద్ర జగన్నాథ స్వామివారినిదర్శించుకుని టెంకాయలను సమర్పించి,కర్పూర హారతులు, ఇచ్చారు. ఆలయ అధికారులు గ్రామ పెద్దలు పర్యవేక్షణలో తిరుగు ప్రయాణమై స్వామివారి సన్నిధికి చేరుకున్నది.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి భాధ్యత ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

**పెదవేగి ,మేజర్ న్యూస్ :** పెరుగుతున్న పారిశ్రామీకరణ, యాంత్రిక విధానాల వల్ల మన చుట్టూ ఉండే పర్యావరణం రోజు రోజుకి నాశనం అయ్యి కాలుష్య కోరల్లో చిక్కుకుని విలవిలలాడుతోంది – ఇదేనా మనం మన భావితరాలకు ఇచ్చే కానుక అని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ యువతను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ కూలర్లో నీళ్ళు పోయటం – ఏసీలతో కరెంట్ బిల్లులు పెంచటం కాదు ప్రతి ఒక్క వ్యక్తి తమ పేరు మీద ఒక మొక్కను నాటి, దానికి నీళ్ళు పోయటం,సంరక్షించడం, తద్వారా ప్రకృతిని కాపాడటం ప్రజలు అలవాటుగా చేసుకోవాలి అని యువతకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. తొలి విడతగా గ్రీన్ కార్పొరేషన్ నుంచి తెప్పించిన 5సంవత్సరాల వయసు పైబడిన 300 మొక్కలను "గ్రామ దీప్" స్వచ్ఛంద సంస్థ,స్థానిక నాయకు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని గ్రామాల్లో నాటే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. దుగ్గిరాల లోని పంచాయితీ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం గ్రామదీప్ సంస్థ ప్రతినిధులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో కలిసి తొలి



మొక్కను నాటి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల సర్పంచ్ గుంజా క్రీస్తుమణి, పెదవేగి మండల పార్టీ అధ్యక్షులు బొప్పన సుధా,గ్రామదీప్ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్,మేనేజింగ్ ట్రస్టీ డా.వెలమాటి మనోహరి, ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ ఏపీవో కిషోర్,పలువురు నాయకులు ,కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంపీడీవో వెంకట రమణకు అండగా ఉంటాం

**– ఎటువంటి అఘాయిత్యానికి పాల్పడవద్దు**
**– రేవు పాట దారుడుపై కేసు పెడతాం**
**– ఎమ్మెల్యే నాయకర్**



**నర్సాపురం,మేజర్ న్యూస్ :** జనసేన పార్టీ కార్యాలయంలో స్థానిక శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ రేవు పాట దారుడు ప్రభుత్వానికి కట్టవలసిన 55 లక్షల రూపాయలు కట్టవలసి ఉన్నదని,ఎంపీడీవో మూడవ తారీకు నుండి 20వ తారీకు వరకు సెలవు మీద వెళ్లారు. ఈ 55 లక్షల ఒత్తిడి మేరకే ఆయన మిస్సింగ్ అయ్యారని పలువురు భావిస్తున్నారని ఆయన అన్నారు.ఎంపీడీవో వెంకటరమణకు మేము అండగా ఉంటాం. మీరు ఎటువంటి ఇబ్బందులు పడకుండా మేము చూసుకుంటాం అవసరమైతే ముఖ్యమంత్రి తో మాట్లాడి మీ సమస్యను పరిష్కరిస్తామని ఆయన మీడియా సమావేశంలో వెల్లడించారు. పాట అయిపోయిన, రోజువారి పాటగా మాజీ శాసనసభ్యులు ముదునూరి ప్రసాద్ రాజు అనుచరుడు రెడ్డప్ప చిన్న దవేజికి ఇచ్చారు. ఎవరైతే సమన్వయ కమిటీ అని పెట్టి వారికి ఇచ్చారో 55 లక్షలు ప్రభుత్వానికి రావలసిన సొమ్మును ఆ సమన్వయ కమిటీ గాని లేదా పాట దారుడు గాని చెల్లించాలి లేని పక్షంలో వీరందరిపై కేసు వేస్తామని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ హెచ్చరించారు. ఎంపీడీవో వెంకటరమణా రావుఎక్కడ ఉన్న మేమంతా మీకు అండగా ఉంటాం ఎటువంటి అఘాయిత్యానికి పాల్పడవద్దని నాయకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జక్కం బాబ్జి,ఆకన చంద్రశేఖర్, వలవల నాని,కొల్లాటి గోపికృష్ణ, నిప్పులేటి తారకరామారావు,పోలిశెట్టి సాంబ, గ్రంధి నాని, నియోజకవర్గ జనసేన టిడిపి బిజెపి నాయకులు జన సైనికు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కుక్కునూరు, వేలేరుపాడు తహసిల్దార్లు అప్రమత్తంగా ఉండాలి

**ఏలూరు,మేజర్ న్యూస్:** రానున్న రెండు రోజుల్లో ఏలూరు జిల్లాలో పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని, క్షేత్రస్థాయి సిబ్బంది ముఖ్యంగా కుకునూరు, వేలేరుపాడు తహశీల్దార్లు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడేప్పుడు చెట్లు,టవర్స్,పోల్స్, పొలాలు,బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదు. సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందండి.

## మంత్రి నిమ్మలతో జిల్లా నూతన ఎస్పీ నయీం అస్మీ భేటీ



**పాలకొల్లు,మేజర్ న్యూస్:** రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ను ఆయన కార్యాలయంలో పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన అద్నాన్ నయీం అస్మీ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతల గురించి చర్చించారు.

## అమ్మ ఆశీస్సులు అందరికీ ఉండాలి : ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్:** గ్రామస్తుల కోరికలు ఫలించి బలుసులమ్మ అమ్మవారి ఆశీస్సులతో అంతా బాగుండాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆకాంక్షించారు. ఆషాడ మాసం తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా బుధవారం తాడేపల్లిగూడెం మండలం పడాల గ్రామంలో వేంచేసియున్న బలుసులమ్మ వారిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.అనంతరం ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ 60 ఏళ్ల అనంతరంఅమ్మవారిజాతర అత్యంత వైభవంగా నిర్వహించడం శుభ పరిణామం అన్నారు.ఆషాడ మాసం సందర్భంగా అమ్మవారికి గ్రామస్తులు, మహిళలు సారె సమర్పించడం జరిగిందన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు జనసైనికులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణకే తొలి ప్రాధాన్యత



**అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : జిల్లా ఎస్పి**

**పెదవేగి,మేజర్ న్యూస్:** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకే తొలి ప్రాధాన్యం ఇస్తామని ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్అన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించబోమని, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పెదవేగి పోలీస్ స్టేషన్ను బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ, స్టేషన్లో రికార్డులను పరిశీలించారు. సిబ్బంది విధుల నిర్వహణ, స్టేషన్ పరిసరాలు, ఫిర్యాదుదారులపట్లతీసుకుంటున్నచర్యలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడికక్కడ స్థానిక పరిస్థితులను తెలుసుకుంటూ అక్కడి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. వివాదాలు సృష్టించెవ్యక్తులు ఎక్కువయ్యారని, అలాంటివారిపట్ల జాగ్రత్తగా ఉండాలని ఆయన చెప్పారు. గ్రామాల్లో ఏర్పాటు చేసే పోలీస్ పికెట్లు పిల్లలపై చెడుప్రభావాన్ని చూపుతాయని,దీన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో వివాదాలకు పోకుండా మంచిని పెంచాలని ఆయన సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో కోడిపందాలు, పేకాట ఎక్కువగా జరుగుతుంటాయని, అలాంటివి నిర్వహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ హెచ్చరించారు. ఎస్పీ వెంట ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎన్.స్సార్యచంద్రరావు, నూజివీడు డీఎస్పీ–జి,లక్ష్మయ్య.సీఐ కె.శ్రీనివాసకుమార్, ఎస్ఐ వి.రాజేం ద్రప్రసాద్ ఉన్నారు.

# నిరుపేద చిన్నారులకు విద్యా పరికరాలు



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్:** తాడేపల్లిగూడెం 32 వ వార్డు కడకట్ల ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు రవికిరణ్ ఆధ్వర్యంలో వాసవి క్లబ్ వారు చిన్నారులకు విద్యా పరికరాలను పుస్తకాలను పంపిణీ చేశారు. రవికిరణ్ విజ్ఞప్తి మేరకు సుమారు 30 మంది పేద విద్యార్థిని విద్యార్థులకు పుస్తకాలు పెన్సిల్స్ స్కేల్స్ ఎరేజర్స్ జామెంట్రీ బాక్సులు వీటితోపాటు స్వీట్స్ హాట్స్ వాసవి క్లబ్ అధ్యక్షులు నున్న ఆనంద్,కార్యదర్శి గుప్తా వనిత క్లబ్ వారితో కలిసి చిన్నారులకు అందజేశారు. వాసవి క్లబ్ అధ్యక్షులు నున్న ఆనంద్ మాట్లాడుతూ సేవకు ప్రతిరూపమే వాసవి క్లబ్ ఎవరికి ఏ సమయంలో కష్టం వచ్చినా ఆదుకోవడానికి ఎల్లవేళలా వాసవి క్లబ్ తోడు ఉంటుందని కష్టపడి చదువుకునే వారికి తప్పనిసరిగా తాము మరింత ప్రోత్సాహకరమైన బహుమతులు అందజేస్తామని తెలియజేశారు.

## ఘనంగా పాండురంగడి కళ్యాణం - ప్రత్యేక పూజలు



**పోలవరం,మేజర్ న్యూస్ :** తొలి ఏకాదశి పర్వదిన సందర్భంగా పోలవరంలో గరుడాద్రి గిరిపై స్వయంభువుగా వెలసిన పాండురంగడి కళ్యాణం ప్రత్యేక పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలో ప్రజానీకం పాండురంగడి కళ్యాణానికి ప్రత్యేక పూజలకు వందలాదిగా తరలి వెళ్లారు. వంశపారంపర్యంగా ఆలయం వద్ద ప్రసాద వితరణ చేసే కేదాసు శ్రీరామ్మూర్తి కుటుంబీకులు ఆలయం వద్ద ప్రసాద పులిహోర వితరణ కార్యక్రమం నిర్వహించారు.

# చదువు మధ్యలో మానేసిన బాలికలకు 'బోఫ్' చేయూత

**ఏలూరు,మేజర్న్యూస్: బాలిక**ల కోసం,మహిళ కోసం 56 ప్రత్యేక విద్యాలయాలు స్థాపించబడి 175 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా 175వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నామని 'బోఫ్' జాతీయ అధ్యక్షులుడాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు తెలిపారు. బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (బోఫ్) ఆధ్వర్యంలో సెలబ్రేషన్స్ ప్రారంభోత్సవ సభ ఏలూరులో నిర్వహించారు. బాలికలు ,మహిళలపై జరుగుతున్నఅఘాయిత్యాలను నిర్మూలించాలంటే వారిని విద్యావంతుల్ని చేయాలనే లక్ష్యంతోవారి కోసం మహాత్మా పూలే,సావిత్రి బాయి పూలేలు 1848 నుంచి 1850 వరకు పూణేలో 56 విద్యాలయాలు స్థాపించారని బోఫ్ సలహాదారులు రిటైర్డ్ తహసీల్దార్ గుబ్బల నాగేశ్వరావు తెలిపారు.

బాలికల అక్షరాస్యత నేటికీ 60 శాతం కూడా మించ లేదని ప్రారంభోత్సవ సభ ముఖ్య అతిథులు, మానవతా సంస్థ నాయకులుఆలపాటి నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. అర్ధాంతరంగా చదువులు ఆపేస్తున్న బాలికలను గుర్తించి తగు సమాచారం బోఫ్కి 77805 73531 ఫోన్ నెంబర్ ద్వారా చేరవేస్తే ఆ బాలికలు చదువు కొనసాగించేందుకు చేయూతనిస్తామని ఎస్టి ఎంప్లాయిస్ అసోసియేషన్రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లబోతుల శ్రీనివాసరావు



తెలిపారు.ప్రతి విద్యార్థి ఇంట భారత రాజ్యాంగం అనే ద్విభాషా పుస్తకాన్ని సభలో న్యాయవాదులు సుబ్రమణ్యం, వెంకటేశ్వరావు ఆవిష్కరించారు. ప్రారంభోత్సవసభలోబాలోత్సవాలకమిటీ నిర్వాహకులు జివిఎల్ నరసింహారావు ,మేతర అజయ్ బాబు,నాయకులుశిరీష్,రమేష్ నాయక్,గోరింకఅనిల్కుమార్,కస్తూరిరావు ,కుమార్రాజా,రోహిత్, యలుబూడి సత్యభారతి,రమేష్, దుర్గాప్రసాద్, అలగా జయరాజు, పుల్లాబొట్ల పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు రొట్టెల పండుగకు ముస్లింల బస్సు యాత్ర



**పోలవరం,మేజర్ న్యూస్ :** మొహరం పండుగ సందర్భంగా నెల్లూరు రొట్టెల పండుగకు పోలవరం మండలంలో ముస్లిం సోదరులు బుధవారం బస్సు యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్సు యాత్ర నిర్వాహకుడు మహబూబ్ జానీ మాట్లాడుతూ ప్రతి ఏటా మొహరం పండుగ సందర్భంగా నెల్లూరు రొట్టెల పండుగకు పోలవరం నుండి బస్సు యాత్ర నిర్వహిస్తున్నామని మార్గమధ్యంలో కడప వరకు ప్రతి దర్గా వద్ద దిగి ప్రత్యేక నమాజులు నిర్వహిస్తామని అలా చేయడం వలన తమ కోరికలు తీరుతాయని ముస్లింలు భావిస్తారని తెలిపారు.

## ఘనంగా నూతన గృహ ప్రతిష్టత ఆరాధన



**అత్తిలి,మేజర్ న్యూస్ :** మోయ్యేరు గ్రామంలో రెవ.గోతం ఆశీర్వాదం చోడవరం గురు మండల అధ్యక్షులు చే నిర్మించబడిన నూతన గృహ ప్రతిష్టత ఆరాధనకు వేలాదిగా సంఘ విశ్వాసులు పాల్గొన్నారు. నూతన గృహ ప్రతిష్ట ఆరాధన షాలేము లూథరన్ సంఘము నందు రెవ. డా. పత్తుల ఆశిష్ విక్టర్ యుపిఎఫ్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ అధ్యక్షతన ఘనంగా జరిగినది. ఈ కార్యక్రమములో పెనుమంట్ర మండలం యు పి ఎఫ్ ప్రెసిడెంట్ రెవ. కె.డేవిడ్ రాజు నీతిమంతుల గుడారము వర్ధిలును అనే అంశం పై శుభాకాంక్షలు తెలియపరిచారు. ఈకార్యక్రమములో మోస్ట్ రెవ.డా.కె.ఎఫ్ పరదేశిబాబు మోడరేటర్ బిషప్ ఏఈఎల్సి రైట్ రెవ.బయ్యే ఆనంద్ బిషప్ వెస్ట్ గోదావరి సినడ్,ప్రార్ధన ఆశీర్వాదములతో నూతన గృహమును ప్రారంభించగా ఆయా గురు మండల అధ్యక్షులు యుపిఎఫ్గౌరవఅధ్యక్షులు బిషప్.డా.వి.చిట్టిబాబు, యుపిఎఫ్ సెక్రటరీ బ్రదర్ బాలు, ఎం.ప్రదీప్, జా. ట్రెజరర్ రెవ.బి ఫ్రాన్సిస్, కార్యవర్గ సభ్యులు పాస్టర్స్ వై.డేవిడ్ రాజు, ఎం.ఆనంద్ కుమార్,వై.జీవన్కుమార్,ఎం.ఆనంద్విజ్జి తదితరులు పాల్గొన్నారు.

## వాగుల్లో ఇసుక తరలిస్తే వాహనం సీజ్

**- డీఎస్పీ సురేష్ కుమార్ రెడ్డి వెల్లడి**



**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్:** సమీప వాగుల్లో నుండి ఇసుక తరలిస్తే వాహనాన్ని సీజ్ చేస్తామని పోలవరం డిఎస్పి సురేష్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం జీలుగుమిల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డిఎస్పి సురేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అనుమతి ఉన్న స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక రవాణా చేయాలి తప్ప సమీప వాగుల నుంచి ఇసుక రవాణా చేస్తే కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేస్తాం అని హెచ్చరించారు. రానున్న వరదలపై అప్రమత్తంగా ఉండాలి అన్నారు. గంజాయి మద్యం ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్ జీలుగుమిల్లి, టీ. నర్సాపురం ఎస్సైలు వి చంద్రశేఖర్, మహేష్ సిబ్బందితదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి ప్రస్థాన సాధన



**నూజివీడు,మేజర్న్యూస్ :** ఆధ్యాత్మిక విశ్వ గురువు సైంటిఫిక్ సెయింట్ పూర్ణ గురువులు శ్రీ శ్రీ గురు విశ్వస్ఫూర్తి గురుదేవుల దివ్య ఆశీస్సులతో గురువారం నుండి ప్రస్థాన సాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్ఫూర్తి కుటుంబం ఆంధ్రప్రదేశ్,తెలంగాణ ట్రస్టుల సంయుక్త ఆధ్వర్యంలో ప్రస్థాన సాధన (యోగ,ప్రాణాయామ,ధ్యానం) శిక్షణ తరగతులు ఆన్లైన్ విధానంలో జరుగుతున్నాయని వివరించారు.తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్లోని వివిధ ప్రాంతాలలో ఉన్న గురు పీఠ ములలో ప్రస్థాన సాధనకార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. నూజివీడులోని సంఘం కాంప్లెక్స్ ప్రాంగణంలో ఉన్న గురు పీఠంలో ఉదయం 4:30 గంటల నుండి 6:30 గంటల వరకు ఈ శిక్షణా తరగతులు జరుగుతాయని చెప్పారు. ప్రజలు పాల్గొని యోగప్రాణా యామంతోధ్యానశక్తిని పెంపొందించుకోవాలని నిర్వాహకులు, స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ సభ్యులు టీవీఎస్ ప్రసాద్ కోరారు.

## పూర్వ విద్యార్థుల ఆధ్యాత్మిక యాత్ర



**పెనుగొండ,మేజర్ న్యూస్:** పెనుగొండ మండలంలోని సిద్ధాంతం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల 1986-87, 10వ తరగతి పూర్వ విద్యార్థులు సుమారు 50 మంది కుటుంబ సభ్యులతో తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలం, సిరిపురం పుణ్యక్షేత్రాల ఆధ్యాత్మికయాత్రలుముగించుకుని వారి స్వగ్రామాలకు చేరుకున్నారు.గతంలో కూడా ఈ పూర్వ విద్యార్థులు మహారాష్ట్రలోని శిరిడీ యాత్ర, తిరుమల తిరుపతి,కాణిపాకం,శివకంచి, విష్ణుకంచి మొదలగు పుణ్యక్షేత్రాలు అలాగేప్రముఖ పర్యాటక స్థలాలైన మోతుగూడెం,రంపచోడవరం,పుష్ప షూటింగ్ స్పాట్లను కూడా కుటుంబ సమేతంగా పూర్తి చేసుకున్నారు. ఈ గ్రూపు తరపున కరోనా కాలంలో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు గ్రూపు యావత్తు వారికి సహాయం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో గ్రూపు కోఆర్డినేటర్ చిలువూరి గంగాధర రాజు (శివ), మహిళా కోఆర్డినేటర్ కముజు శశిదేవితో పాటు 50 మందికి పైగా పాల్గొన్నారు.

## విశ్వ దుర్గేశ్వరీ మాతకు ఆషాడ సారె

**టిడిపి నేత గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు**





**తాడేవల్లిగూడెం,మేజర్ న్యూస్:** ఆషాఢ మాసం తొలి ఏకాదశి సంధర్భంగా ఈ రోజు స్థానిక 17వ వార్డు,విశ్వ దుర్గేశ్వరి పేటలో కొలువై ఉన్న విశ్వ దుర్గేశ్వరి సమేత ఆనందేశ్వర స్వామి వారి ఆలయం నందు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి,పట్టణ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీ విశ్వ దుర్గేశ్వరి అమ్మవారిని శాకాంబరీ దేవిగా తీర్చిదిద్దారు. గొర్రెల శ్రీధర్ సునీత దంపతులచే అమ్మవారికి ఆషాడం సారె భక్తులందరితో కలిసి వారి ఇంటి వద్ద నుండి మేళతాళాలతో, తీన్మార్ డప్పులతో ఊరేగింపుగా తీసుకొని వెళ్ళారు. ముందుగా 17వ వార్డులో వున్నటువంటి ఆలయాలు వినాయకుని గుడి వద్ద పూజలు నిర్వహించి,సీతారాముల వారి ఆలయంలో సీతమ్మ వారికి సారె సమర్పించి,తరువాత గ్రామ దేవతగా పిలవబడే ముత్యాలమ్మ వారిని దర్శించుకొని, సారె సమర్పించారు. అనంతరం శ్రీ విశ్వదుర్గేశ్వరి అమ్మవారికి ఆషాడం సారె తీసుకుని వెళ్లి ఆలయం నందు అమ్మవారికి పూజలు నిర్వహించి సారె ఒకటి సమర్పించారు. అన్నదాన కార్యక్రమంలో సుమారు 1500 మంది మహిళలు భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# ఏకలవ్యుడికి మంత్రి డా.నిమ్మల ఘన నివాళులు

**పాలకొల్లు,మేజర్ న్యూస్:** జగన్ ఐదేళ్ల పాలనలో ఎస్టీల సంక్షేమం, అభివృద్ధిని పట్టించుకోకుండా ఎస్టి కార్పొరేషన్ నిధులను పక్కదో పట్టించారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన నెలరోజుల్లో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నుంచి బయటపడేలా కేంద్ర ప్రభుత్వ సహకారంతో ముందుకు వెళ్తున్నారన్నారు. పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్లో గిరిజన హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏకలవ్యుని జయంతి సందర్భంగా జరిగిన వేడుకల్లో మంత్రి రామానాయుడు పాల్గొని ఏకలవ్యుని విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఎస్టి నాయకులు సభ్యులతో కలసి మంత్రి కేక్ కట్ చేసి అందరికీ తినిపించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ఏకలవ్య అంటే నాకు వ్యక్తి గతంగా అభిమానం,స్ఫూర్తి దాయకం,అందరికీ ఆరాధ్య దైవమని అన్నారు. ఏకలవ్య విగ్రహానికి యస్టీ నాయకులు,సభ్యులు సహకారంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆనాడు పాలకొల్లు నడిబొడ్డున ఏకలవ్య విగ్రహం ఏర్పాటు చేసుకున్నామని, అందరికీ స్ఫూర్తి దాయకమని అన్నారు. జగన్ హయాంలో యస్టీ సంక్షేమానికి ఏమి చేయలేదని, యస్టీ



కార్పొరేషన్కు కేటాయించిన నిధులు కూడా పక్కదారి పట్టించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, జీవి, పేచ్చెట్టి బాబు, ఉన్నమట్ల కబర్ధి, రాష్ట్ర ఎస్టీ సెల్ సెక్రెటరీ జె.వెంగలయ్య, జిల్లా ఎస్టీ సెల్ నాయకులు కూతాడ శ్రీనివాస రావు, సాల మల్లేశ్వర రావు, జి.తంభి,సాల నరసయ్య, బండి పెద్దిరాజు,గిరిజన సభ్యులు, తెలుగు దేశం,బిజెపి, జనసేన పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# అడుగుకోమడుగు - గజానికో గొయ్యి

**- ఇది ఆర్అండ్బి రహదార్ల దుస్థితి**

**- ప్రమాదపు అంచున వాహనదారులు**

**ముదినేపల్లి,మేజర్ న్యూస్ :** ప్రధాన రహదారుల్లో పెద్ద గుంతలు ఏర్పడి మార్జిన్లు కోతకు గురయ్యాయి. ఇది ముదినేపల్లి మండలం వడాలి,చిగురుకోట,సింగరాయపాలెం,కోరుకొల్లు రోడ్డు,గుడ్లవల్లేరు ఆర్ అండ్బి రహదారుల దుస్థితి. వర్షాలకుఇవితటాకాలను తలపిస్తున్నాయి. ఎక్కడ గొయ్యి ఉందో తెలియక వాహనదారులు బైకులు పల్టీలు కొడుతున్నాయి. రహదారుల్లో వెళ్లే వాహనాలు టైర్ల కింద రాళ్లు స్లిప్పయి పాదచారులను గాయపరుస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో కొన్నిసార్లు చేస్తున్న తాత్కాలిక మరమ్మత్తులు తూతూ మంత్రంగా ఉన్నాయి. ఇంత ప్రమాద పరిస్థితులు నెలకొన్న సంబంధితశాఖ ఏమాత్రం పట్టించుకోవడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు కన్నెత్తి చూడకపోవడంతో ఈ



రహదారులపై ప్రయాణం నరకప్రాయంగాఉందని,జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పటిష్టంగా రహదారులకు ప్రస్తుతం మరమ్మతులైన చేపట్టాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

# రోడ్లపై కూలిన చెట్లు

**- రాకపోకలకు అంతరాయం**



**పోలవరం,మేజర్ న్యూస్ :** పోలవరం నుండి కన్నాపురం వెళ్లే రోడ్డు మార్గంలో బుధవారం తెల్లవారుజామున ఈదురు గాలులకు రోడ్డుపై భారీ వృక్షాలు నేలకూలాయి. దీంతో పోలవరం నుండి దొండపూడి కన్నాపురం కొయ్యలగూడెం జంగారెడ్డిగూడెం వెళ్లే రోడ్డు మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. స్పందించిన స్థానికులు ఆర్అండ్బి సిబ్బంది వృక్షాలను తొలగించి మార్గాన్ని సుగమం చేసి రాకపోకలు పునరుద్ధరించారు.

# ఆశా వర్కర్లు కనిపించే మదర్ థెరిస్సాలు

**- మంత్రి రామానాయుడు**



**పాలకొల్లు,మేజర్ న్యూస్:** కోవిడ్ సమయంలో ఆశా వర్కర్లు సేవలు గుర్తించానని, మదర్ తెరిస్సాలా సేవలందించారని,రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులో బుధవారం ఆయన కార్యాలయంలో మంత్రి రామానాయుడు ను ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో ఆశా వర్కర్లు కలిశారు. తమకు కనీస వేతనాలు పెంచాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ ఆశాలుగా మార్పు చేయాలని, ఆశా నియమకాలు ప్రభుత్వమే చేపట్టాలని, ప్రభుత్వ సెలవులు, రిటైర్మెంట్, గ్రూప్ ఇన్సూరెన్స్,సంక్షేమ పథకాలు వంటివి అమలు చేయాలని కోరుతూ మంత్రి రామానాయుడు కు వినతిపత్రం అందజేశారు.

ఆయన సానుకూలంగా స్పందిస్తూ మీ న్యాయమైన కోర్కెల అమలకు ప్రభుత్వ పరంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో మీ న్యాయమైన కోర్కెల కోసం చలో విజయవాడ కార్యక్రమానికి వెళుతున్న మిమ్మల్ని పోలీస్ స్టేషన్లో పెట్టారని తెలిసి వచ్చినందుకు మాపై అక్రమ కేసు బనాయించారని, విజయవాడ కోర్టుకు తిరుగుతున్నామని మంత్రి రామానాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు సిఐటియు నాయకులు జవ్వాది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జనసేన సభ్యత్వ నమోదుతో ఆపదలో భరోసా



**పెనుగొండ,మేజర్ న్యూస్ :** పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్త క్రియాశీలక సభ్యత్వ నమోదు చేసుకోవడం ద్వారా ఆపదలో భరోసాగా ఉపయోగపడుతుందని జనసేన పెనుగొండ మండలం అధ్యక్షుడు కొండవీటి శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల జూలై 18 వ తారీకు నుండి 28వ తారీకు వరకు పది రోజుల పాటు ఈనమోదు ప్రక్రియ జరుగును అనిజనసేనపార్టీ పెనుమంట్ర మండల అధ్యక్షులు కోయ వెంకట్ కార్తీక్ తెలియజేశారు. ఆచంట నియోజకవర్గం జనసేన పార్టీ నాలుగు మండలాల నుండి 50 మంది వాలంటీర్లతో ఈనమోదు ప్రక్రియ జరుగుతుంది అని తెలియజేశారు మనకోసం మన బిడ్డల భవిష్యత్తు కోసం భావితరాల భవిష్యత్తు కోసం జనసేన పార్టీ అధ్యక్షులు,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ కుటుంబ సభ్యులకు భరోసా కల్పించే విధంగా జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులకు రూ.500 లతో క్రియాశీలక సభ్యత్వం తీసుకుంటే ఏదైనా ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ 5 లక్షల చెక్కును అందజేసి వారి కుటుంబానికి భరోసా కల్పించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్రియాశీలక వాలంటీర్స్,సభ్యులు పెనుగొండ టౌన్ అధ్యక్షులు గుర్రాలసూరిబాబు, ఆచంట మండల అధ్యక్షులు జవ్వాది బాలాజీ,జిల్లా ఉపాధ్యక్షులు వెంగళదాస్ దానయ్య,జిల్లా సెక్రెటరీ చిట్టూరి శ్రీనివాస్, ఆచంట మండలం వైస్ ఎంపీపీ ఎర్రగొప్పుల నాగరాజు,పెనుమంట్ర మండల ఉపాధ్యక్షులు షేక్ మొహమ్మద్ ఆలీ, మండల కార్యదర్శి ఆకివీటి నాగ శ్రీహరి, సంయుక్త కార్యదర్శి చిడిపి రామకృష్ణ,దేవదానం, మండల కమిటీ సభ్యులు గ్రామ కమిటీ సభ్యులు జన సైనికులు వీర మహిళలు పాల్గొన్నారు.

# మతసామరస్యం కోసం సీజేఏసీ కృషి

**- ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ బాబు**

**నర్సాపురం,మేజర్ న్యూస్ :** క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ (సీజేఏసీ) మూడవ వార్షికోత్సవం నిమిత్తం ఆంధ్రప్రదేశ్లో ఉన్న 26 జిల్లాలో ఉన్న జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ఉన్న ముఖ్య నాయకులు,సేవకులు, రాష్ట్ర నలుమూలల నుంచి హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడివిక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ మత సామరస్యం కొరకు దేశంలోనే పాటుపడుతున్న ఏకైక సమస్త సిజేఏసీ అని,ఏ సమస్య మీకు ఉన్న నా దృష్టికి తీసుకుని వస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వలన ఈ దేశంలో ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందారని చట్టాల మీద రాజ్యాంగం మీద ప్రజలందరూ అవగాహన పొందాలనిఅన్నారు. నర్సాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ మతసామరక్షత కొరకు అన్ని కులాల మతాల వారిని కలుపుకుని పనిచేస్తున్న క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీని అభినందించారు.

అంతేకాకుండా క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ద్వారా లా చదువుతున్న ఏడుగురు సభ్యుల్ని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సి జేఏసి వ్యవస్థాపక అధ్యక్షులు రెవ.డా.బిషప్ జాషువా




డానియల్,జాతీయ గౌరవ అధ్యక్షులు రెవరెండ్ బిషప్ ఉటుకూరిరాజ కుమార్,జాతీయ ఉపాధ్యక్షులు చింతాడఆనంద్ పాల్, సౌత్ జోనల్ అధ్యక్షులు తాళ్లూరి రెవరెండ్ ప్రభు దయాళ్,స్టేట్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ బ్రదర్ సింహో పాల్,స్టేట్ ఈసీ మెంబర్ ఏసు పాదం,పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు తిరుమాని యాకోబు,నర్సాపురం మొగల్తూరు మండల నాయకులు పాల్గొన్నారు.



## దెందులూరు నియోజకవర్గం అభివృద్ధికి సహకారం

**- మంత్రి పార్ధసారధి హామీ**

**- సమస్యలు వివరించిన ఎమ్మెల్యే చింతమనేని**

**నూజివీడు,మేజర్ న్యూస్:** నూజివీడు మంత్రి క్యాంప్ కార్యాలయం రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి ని మర్యాద పూర్వకంగా కలిసిన దెందులూరు ఎమ్,ఎల్,ఏ చింతమనేని ప్రభాకర్.. దెందులూరు నియోజకవర్గంలో ని రోడ్లు, హౌసింగ్ సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు దెందులూరు అన్ని విధాలుగా తోడ్పాటు చేసి అభివృద్ధి పథంలో కలిసి పని చేద్దామని హామీ ఇచ్చారు. చింతమనేని ప్రభాకరరావు వెంట పార్టీ కార్యకర్తలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నలుగురు అత్యాచార నిందితులు అరెస్టు

**టి.నరసాపురం,మేజర్ న్యూస్:** మండలంలో ఒక గ్రామానికి చెందిన 16 ఏళ్ల మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకునితో పాటు అతనికి సహకరించిన మరో ముగ్గురు యువకులు మొత్తం నలుగురిని బుధవారం అరెస్టు చేసినట్లు పోలవరం డిఎస్పీ కె సురేష్ కుమార్ రెడ్డి తెలిపారు.
నిందితుడు నాగకుమార్ తో పాటు అతనికి సహకరించిన ముగ్గురుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు డిఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ డి.దుర్గా మహేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సౌలభ్యం కోసమే ఉచిత ఇసుక

**- అక్రమ రవాణా జరిగితే కఠిన చర్యలు:డిపిఓ 'తూతిక'**

**- ఇసుక కంప్లైంట్ టోల్ ఫ్రీ నెంబర్ 1800-425-6025**



**ఉంగుటూరు,మేజర్ న్యూస్ :** ప్రజల కోసమే ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తుందని దళారీ వ్యవస్థ లేకుండా ప్రజలు నేరుగా ఇసుక డిపో నుంచి ఉచితంగా ఇసుకను కొనుగోలు చేయవచ్చని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి, జిల్లా స్థాయి సాండ్ కమిటీ సభ్యులు తూతిక శ్రీనివాస విశ్వనాధ్ అన్నారు. ఉంగుటూరు మండలం, చేబ్రోలు ఇసుక డిపోని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీపీఓ శ్రీనివాస విశ్వనాధ్ జిల్లాలోని వివిధ ఇసుక స్టాక్ పాయింట్లలో నిల్వలు, ఉచిత విధానం అమలుపై మాట్లాడారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో జిల్లాలో ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తుందని అన్నారు. జిల్లాలోని ఉంగుటూరు మండలం చేబ్రోలు, కుక్కునూరు మండలం వింజరం , ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్లు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు.

చట్టబద్ధమైన పన్నులు,లెవీలతో పాటు కార్యకలాపాల ఖర్చు మాత్రమే వినియోగదారుల నుండి వసూలు చేయబడుతుందన్నారు. చేబ్రోలు (ఉంగుటూరు మండలం) స్టాక్ పాయింట్ వద్ద టన్నుకు 538 రూపాయలు,వింజరం (కుక్కునూరు మండలం) స్టాక్ పాయింట్ వద్ద టన్నుకు 362 రూపాయలు ,ఇబ్రహీంపేట (కుక్కునూరు మండలం) స్టాక్ పాయింట్ వద్ద 210 రూపాయలు చొప్పున ఛార్జీలుగా జిల్లా స్థాయి సాండ్ కమిటీ (డి.ఎల్.యస్.సి) నిర్ణయించడం జరిగిందన్నారు. ఇసుక అక్రమాలు జరుగుతే కఠినమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అక్రమంగా ఇసుక రవాణా జరుగుతే 10 వేల నుంచి లక్ష రూపాయల వరకు జరిమానా విధించడం జరుగుతుందని అలాగే ఇసుక అక్రమాలు నివారించడానికి, సహకారానికి టోల్ ఫ్రీ 1800-425-6025 నెంబర్ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 75000 మెట్రిక్ టన్స్ ఇసుక ప్రజలకు అందుబాటులో ఉందని డీపీఓ శ్రీనివాస విశ్వనాధ్ అన్నారు.

## వైసిపి పాలనలో1.75 లక్షల ఎకరాల భూఅక్రమాలు

**- నియోజకవర్గ టిడిపి కన్వీనర్ వీరమల్లు ఆరోపణలు**



**ముదినేపల్లి,మేజర్ న్యూస్ :** వైసిపి పాలనలో1.75 లక్షల ఎకరాలు భూఅక్రమాలకు పాల్పడ్డారని నియోజకవర్గ టిడిపి కన్వీనర్ వీరమల్లు నరసింహారావు పేర్కొన్నారు. ప్రభుత్వ శ్వేత పత్రాలపై ముదినేపల్లి ఎన్డిఏ కార్యాలయం వద్ద కొడాలి వినోద్, ఎన్డిఏ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూ దందాలు, సహజవనరుల దోపిడి నివారణకు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రభుత్వం రద్దు చేయడం జరిగిందన్నారు. హౌసింగ్ కాలనీలు ఎక్కడ రావాలో వైసీపీ నాయకులు నిర్ణయించి ముందే స్థలం కొని తిరిగి అధిక రేటుకు ప్రభుత్వానికి అమ్మేవారిని ఐదేళ్ల వైసిపి పాలనలో చేసిన అక్రమాలపై నేతలు ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు లింగమనేని భానుప్రసాద్,పోసిన పాపారావుగౌడ్, యలవర్తి భవాని, పంతగాని సురేష్,మరీదు రాఘవరావు,అబ్దుల్ ఖలీల్,పాగోలు విజయ్,పెరుమళ్ళ శివనాగరాజు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా వుండాలి

**- డిఎంఅండ్‌హెచ్‌ఓ శర్మిష్ట**



**టి.నరసాపురం,మేజర్ న్యూస్:** గ్రామాల్లో సీజనల్ వ్యాధులపట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా వుండాలని డీఎంఅండ్ హెచ్ఓ శర్మిష్ఠ సూచించారు. మండలంలోని టి నరసాపురం, బొర్రంపాలెం ప్రభుత్వ ఆసుపత్రులను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. టి.నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రి చుట్టూ పరిసరాలు పరిశీలించారు. దిగువ ప్రాంతం కావడం వల్ల వర్షాలకు చుట్టూ ఆవరణ మొత్తం వర్షపు నీరు నిల్వ ఉండడంతో సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులకు లెటర్ పెట్టమని వైద్యులకు సూచించారు. నిర్మాణంలో ఉన్న అదనపు భవన నిర్మాణ పనులు కూడా పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించిన ఆమె మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామంలో గ్రామాల్లో ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా ఉండేందుకు ఆశాలు, ఎఎన్ఎంలు, వైద్యులు పంచాయితీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపట్టాలన్నారు. మలేరియా,డెంగీ, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాదులు ప్రభలకుండా చర్యలు చేపట్టాలని ఆమె తెలిపారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు జె కల్పనారాణి,ఫణీంద్ర బాబు, ఆంజనేయులు, ఇమామ్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కారంచేడు మృత వీరులకు దళిత మహాసభ జోహార్లు

**ఏలూరు,మేజర్ న్యూస్ :**1985 జులై 17 న కారంచేడు లో జరిగిన మారణహోమం లో ఆరుగురు మాదిగలు అమరులయ్యారని, వారికి దళిత మహాసభ జోహార్లు అర్పిస్తుందని జిల్లా శాఖ అధ్యక్షులు నేతల రమేష్ బాబు అన్నారు. కారంచేడు మారణహోమం జరిగి నేటికి 39 సంవత్సరాలు అయిందని, ఆనాటి నుండి నేటి వరకు దళితులపై అనేక అత్యాచారాలు, హత్యలు, దాడులు, దౌర్జన్యాల సంఘటనలు జరుగుతునే ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.అయినా దళిత వర్గాలలో కొంచమైనా మార్పు రాలేదని,రాజకీయ చైతన్యం అసలు కలగడమే లేదన్నారు. ఏనాటికైనా నా జాతి ప్రజలు ఈ దేశానికి పాలకులుగా మారతారని ఆశించిన బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయం నెరవేరాలని ఆకాంక్షించారు. తమ ఊపిరి కోల్పోయి దళితుల ఆత్మ గౌరవ పోరాటాలకి ఊపిరి పోసిన కారంచేడు మృత వీరులకు మరొక్కసారి జోహార్లు అర్పిస్తున్నానని రమేష్ బాబు పేర్కొన్నారు.

## శేషాచల కొండపై పోటెత్తిన భక్తులు తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు





**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** ప్రఖ్యాతిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన చిన వెంకన్న ఆలయం భక్తులతో కిటకిటలాడింది. బుధవారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళ భక్తులు ఆలయాళంలో రాగి చెట్టుకు పూజలు నిర్వహించుకున్నారు.భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో చేరుకున్నారు. కేశఖండనశాల క్యూ లైన్లు,దర్శనం క్యూ లైన్లు, ప్రసాదాల క్యూలైన్లు, భక్తలతో పోటోత్తాయి. భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు క్యూలైన్లలో త్రాగునీరుతో పాటు,క్యూ కాంప్లెక్స్‌లో చిన్నపిల్లల కోసం పాలు బిస్కెట్లు ఏర్పాటు చేశారు.అలాగే స్వామివారి నిత్య కళ్యాణంలో సుమారు100 జంటలు పాల్గొని స్వామివారి కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించారు.

## జగన్నాథ స్వామి ఆలయంలో కొవ్వలి ఫౌండేషన్ సభ్యుల ప్రత్యేక పూజలు



**నరసాపురం,మేజర్ న్యూస్ :**పట్టణంలోని జగన్నాథస్వామి కల్యాణోత్సవం, తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా కొవ్వలి ఫౌండేషన్ సభ్యులుప్రత్యేక పూజలు చేశారు.బుధవారం జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు క్షేమాన్ని కాంక్షిస్తూ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకుడు, కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు వ్యక్తిగత కార్యదర్శి సంకు భాస్కర నాయుడు మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ మోడీ నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధి విజయవంతంగా కొనసాగుతుందని అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే ప్రజారంజకంగా పరిపాలన అందిస్తుందని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని అన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, కొవ్వలి రామ్మోహన్ నాయుడులలకు దేవుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుతూ స్వామి వారికి పూజలు నిర్వహించామని అన్నారు.

## 9 మంది తల సేమియా చిన్నారులకు రక్తమార్పిడి



ఏలూరు,మేజర్ న్యూస్: ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ తల సేమియా భవనంలో 9 మంది తల సేమియా చిన్నారులకు రక్తమార్పిడిని నిర్వహించినట్లు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బివి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ తల సేమియా, సికిల్ సెల్ ఎనీమియా చిన్నారుల కోసం ఉత్సాహవంతమైన యువకుల నుంచి రక్తాన్ని సేకరించడానికి జిల్లాలో ఉన్న డిగ్రీ, పిజి కళాశాలల వద్ద అధునాతన పరికరాలతో కూడిన ఏసీ మొబైల్ బ్లడ్ కలెక్షన్ బస్సును పెడుతున్నామని అన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి తల సేమియా చిన్నారులను ఆదుకోవాలని కోరారు. బుధవారం తల సేమియా చిన్నారులు,వారి సహాయకులకు 25 మందికి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు అడుసుమిల్లి సత్యనారాయణ,పండ్లను కె.రామ్ శ్రీ భాస్కర్, మోతే అనుపమాలు పంపిణీ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి కేబి సీతారాం,డాక్టర్ ఆర్ ఎస్ ఆర్ కే వరప్రసాదరావు,బిఆర్‌సి హెచ్ నారాయణ, డాక్టర్ జి.స్పందన, లయన్స్ డిస్టిక్ ఉమెన్ లీడర్ కె.పద్మావతి,లయన్స్ గైనర్కి క్లబ్ ప్రెసిడెంట్ ఎం.అనుపమ,కెవి రమణ తదితరులు పాల్గొన్నారు.

## అంకితభావంతో పనిచేస్తే తగిన గుర్తింపు - బిజెపి నేత మునుకోటి



**నరసాపురం,మేజర్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీలో అంకితభావంతో పని చేస్తే తగిన గుర్తింపు లభిస్తుందని ఆ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షులు మునుకోటి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం పట్టణంలోని 22వ వార్డు బిజెపి అధ్యక్షులు కొమ్ము వెంకట్రావు జన్మదిన వేడుకలు ఆయన స్వగృహం దగ్గర ఆ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మునుకోటి మాట్లాడుతూ గ్రామస్థాయి నుండి పనిచేస్తున్న కార్యకర్తలు కేంద్ర స్థాయి వరకు అభివృద్ధి కావాలంటే అది బిజెపి పార్టీ తోటే సాధ్యమన్నారు. కొమ్ము వెంకట్రావు మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలోపట్టణ ఉపాధ్యక్షులు మోచర్ల సత్య కృష్ణ జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి కంచర్ల నాగేశ్వరరావు జిల్లా యస్ సి మోర్చా ప్రధాన కార్యదర్శి మోరంపూడి రాము, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ కొప్పర్తి వెంకట్, పట్టణ ప్రధాన కార్యదర్శి అగ్నిహొత్రం రవికిరణ్, రావూరి ప్రసాద్‌లు పట్టణ కార్యదర్శి సోమిశెట్టి సత్య భరత్, రాష్ట్ర బీసీ నాయకులు ప్రముఖ న్యాయవాది వనమాల శ్రీనివాస్,పార్టీ సీనియర్ నాయకులు నాగళ్ళ కిషోర్తదితరులు పాల్గొన్నారు.

# వివిధ పథకాలకు రూ.8లక్షలు విరాళాలు







**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** పవిత్ర పుణ్యక్షేత్రమైన చిన్న వెంకన్న ఆలయానికి వేరు వేరు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం స్వామి వార్లను అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు.అనంతరం ఆలయ ఆఫీసు వద్ద సిబ్బందికి విరాళాలను సమర్పించారు. సుబ్రహ్మణ్య నాగ శేషుబాబు రూ1లక్ష116లు, దొమ్మేరు వాస్తవ్యులు డి చంద్రకళ హేమలత దంపతులు ఒక లక్ష 116 రూపాయలు, రాజమండ్రి వాస్తవ్యులు శ్రీరామాజీ ఉషారాణి దంపతులు 1లక్ష, 116లు, సిహెచ్ దుర్గాప్రసాద్ రమాదేవిదంపతులు1లక్ష, 1వేయి116లు, జంగారెడ్డి గూడెం వాస్తవ్యులు పామర్తి వెంకటేశ్వరరావు ఒక లక్షా 116 లు, విశాఖపట్నం వాస్తవ్యులు కిమిడి మోహన్ రావు ఒక లక్ష, జంగారెడ్డిగూడెం వాస్తవ్యులు డాక్టర్ బి గణేశ్వర శ్రీనివాస వరప్రసాద్ గిరిజ దంపతులు ఒక లక్ష 116 లు, రాజమండ్రి వాస్తవ్యులు డాక్టర్ పి పవన్ కిషోర్



ఆరతి దంపతులు 1లక్ష1వేయి116 లు, విరాళాన్ని సమర్పించారు. వారికి ఆలయ ఈవో వేంద్ర త్రినాధరావు, ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు పథకాల పత్రాలను స్వామివారి ప్రసాదాలను అందించి తెలిపారు.

# అడవులు పర్యావరణాన్ని కాపాడే రక్షకులు



**చింతలపూడి, మేజర్ న్యూస్:** కృష్ణాపురం గ్రామ అడవుల్లో బంజారా బజరంగీ భేరి కమిటీ ఆధ్వర్యంలో వేప, నేరేడు, జీడి, మామిడి, పనస, కుంకుడు, సీతాఫలం మొదలగు విత్తనాలు చల్లడం జరిగిందని జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ తెలిపారు. సీతలా భవాని అడవులను రక్షించి పశువులను, మానవులను కాపాడే బంజారాల వన దేవత అని అన్నారు. అడవులు జీవ వైవిధ్య నిలయాలు మాత్రమే కాకుండా మానవ అవసరాలను తీరుస్తూ, పర్యావరణాన్ని కాపాడే రక్షకులు అని అన్నారు. గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణు గోపాల్ మాట్లాడుతూ ఒకప్పుడు దట్టమైన అటవీప్రాంతంగా విరాజిల్లిన టి.నర్సాపురం మండలంలో ప్రస్తుతం అడవులు వేగంగా అంతరించి పోతున్నాయని వీటిని కాపాడుకోడానికి లక్ష విత్తనాలు చల్లే కార్యక్రమం పెట్టుకుని వేప,జీడి, మావిడి, పనస, కుంకుడు, నేరేడు, సీతాఫలం లాంటి విత్తనాలు కృష్ణాపురం అడవుల్లో చల్లామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు జరభల కృష్ణ ప్రసాద్, భూక్యా బిగనాధం, ధరావత్ రవి, బంగారయ్య, హసావత్ రవీంద్ర, భూక్యా రాములు, శ్రీనివాస్, భూక్యా చంటి,సురేష్, బద్దుబాబు, జరభల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# 21న ఏలూరులో ఉచిత గుండె వైద్య శిబిరం

**- ఎమ్మెల్యే బడేటి చంటి వెల్లడి**

**ఏలూరు,మేజర్‌న్యూస్:** పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించే లక్ష్యంతో పనిచేస్తున్నామని, ముఖ్యంగా గుండెకు సంబంధించిన వ్యాధులతో బాధపడేవారికి అత్యంత ఖర్చుతో కూడిన వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు తమ పరిధిలో చర్యలు తీసుకుంటున్నట్లు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టంచేశారు. ఆ దిశగా ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్యంతో ముందుకు వెళ్తున్నామని, ఇందులో భాగంగానే ఏలూరులోని జిల్లా ఆసుపత్రిలో ఈ నెల 21వ తేదీ ఆదివారం విజయవాడకు చెందిన పీవీఆర్ కార్డియాక్ అండ్ మల్టిస్పెషాల్టీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నామన్నారు. ఏలూరులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వైద్య శిబిరం వివరాలను ఆయన వెల్లడించారు. అవసరార్థులకు పూర్తివైద్య సేవలు, గుండె చికిత్సలు విజయవాడలోని పీవీఆర్ హాస్పిటల్స్‌లో ఉచితంగా అందిస్తారని, దీనికిగాను తాను ప్రత్యేకంగా ఎమ్మెల్యే లెటర్ ఇవ్వడం




జరుగుతుందని చెప్పారు. బస్ ఛార్జీలు కూడా పెట్టుకోలేని పేదలకు తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే చంటి భరోసానిచ్చారు. మీడియా సమావేశంలో మాజీ డిప్యూటి మేయర్ చోడే వెంకటరత్నం, టిడిపి నాయకులు బెల్లపుకొండ కిషోర్,ఆర్నేపల్లి తిరుపతి, మారం అను తదితరులు పాల్గొన్నారు.

## 23 నుండి ఆధార్ అప్డేట్ మొబైల్ క్యాంపులు



**భీమవరం,మేజర్‌న్యూస్:** జిల్లా ప్రజలకు ఆధార్ అప్డేషన్ కు మరొక అవకాశం.గ్రామ, వార్డు సచివాలయలు, పాఠశాలలు, కాలేజీలలో నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఆధార్ అప్డేషన్ మొబైల్ క్యాంపుల ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు.ఈ నెల 23 నుండి 27 వరకు ఐదు రోజులు పాటు ఆధార్ అప్డేట్ ప్రత్యేక మొబైల్ క్యాంపులు నిర్వహించనున్నారు. జిల్లాలోని యానాది, ఎరుకల కుటుంబాలకు ఆధార్ ఎన్రోల్మెంట్ కు తాహసిల్దార్ లకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాలు జారీ చేశారు. ఆధార్ అప్డేషన్ కు జులై 23 నుండి జూలై 27 వరకు ఐదు రోజులు పాటు జిల్లా అంతటా నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ప్రత్యేక మొబైల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదవాడ నాగరాణి తెలిపారు.గ్రామ, వార్డు సచివాలయలు, పాఠశాలలు, కాలేజీల్లో ఆధార్ అప్డేట్ మొబైల్ క్యాంపులు ఏర్పాటు చేసి పెండింగ్ లో ఉన్న ఆధార్ సర్వీసులను అప్డేట్ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రతి మండలంలో జూలై 23 నుండి ప్రతిరోజు ఎంపిక చేసిన నాలుగు ప్రాంతాలలో ఆధార్ అప్డేట్ మొబైల్ క్యాంపులను ఏర్పాటు చేసే జూలై 27 నాటికి జిల్లాలోని 20 మండలాల్లో కొత్త ఆధార్ ఎన్రోల్మెంట్, ఆధార్ డాక్యుమెంట్, ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ లను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఏ ఏ తేదీల్లో ఏ గ్రామ, వార్డు సచివాలయాలు, పాఠశాలలు, కళాశాలలో ఆధార్ అప్డేట్ మొబైల్ క్యాంపులు నిర్వహించేది మున్సిపల్ కమిషనర్లు, మండల అభివృద్ధి అధికారులు విస్తృత ప్రచారం చేయాలన్నారు. వీరవాసరం ఎస్సీ కాలనీలోనీ యానాది, ఎరుకల కుటుంబాలకు ఆధార్ ఎన్రోల్మెంట్ తో పాటు, జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న యానాది, ఎరుకల కుటుంబాలను గుర్తించి వారిలో ఆధార్ లేని వారికి ఎన్రోల్మెంట్ తప్పనిసరిగా చేయించాలని సంబంధిత మండల తహసిల్దార్లను ఆదేశించడం జరిగిందన్నారు. జిల్లా ప్రజలు ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు.